# ‘దరిద్రనారాయణు డని ఆ జగద్రక్షకుడికి బిరుదైతే!’

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

## ౧

పిల్లవా డిప్పుడు కొంచెం పెద్దవాడై నాడు. పొరలు తీయించడంవల్ల నాభర్తకు మరల నేత్రాలు ఎప్పటి రీతిగా వచ్చినవి. ఇప్పుడు మళ్లీ ఇద్దరం పాటు బడుతున్నాము. అన్నవస్త్రాలకు కరువు లేకుండా రోజులు గడుపుకుంటున్నాము. కాని అప్పుడు ఆయనకు బొత్తిగా కళ్లు కనిపించకుండా పోయి, నేను పసిబిడ్డ తల్లినై బిడ్డ సంరక్షణనిమిత్తమూ, ఆయన సంరక్షణనిమిత్తమూ యిల్లు కదలటానికి వీలు లేకుండా ఉన్న ఆరోజులలో యేపూట కాపూట యెంత కష్టపడ్డాము! నిజంగా ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు కన్నుల గట్టినట్టవుతుంది ఆ దృశ్యం.

## ౨

అది జ్యేష్ఠమాసం; యెండలు గాడ్పులు బహు జాస్తిగా ఉన్నవి. ఆ యెండ గాడ్పు లెంత అధికంగా ఉన్నవో అంతకంటె అధికంగా ఉన్నవాయేడు ఇంటింటా వడుగులూ పెండ్లిండ్లూ; దినదినమూ ఇరవైముప్పై శుభకార్యాలైనా జరుగుతున్నాయి ఊళ్లో. నిత్యమూ మంచి వస్త్రాభరణాదులు ధరించిన పురుషులూ, స్త్రీలూ మేళతాళాలతో పిలుపులకు తిరుగుతునే ఉన్నారు. తెల్లవారితే ఆవూళ్లో ఇరవై శుభముహూర్తాలైనా ఉన్నవట; అందువల్లనే పిలుపుమేళా లానాటి సాయంత్రం మఱీ అధికంగా వినవచ్చినవి. ఆ మేళములు వినవచ్చినది మొదలు నేను మాకుటీరప్రాంగణంలోనే నిలబడ్డా, ఏతల్లియైనా రవ్వంత నోసటబొట్టు పెట్టి రమ్మంటుందేమోనని. రాత్రి యెనిమిదిగంటలైంది నిలబడి నిలబడి కాళ్లు గుదురుపట్టిపోయినాయి. ఒక్కరూ పిలిచిన పాపాన పోలేదు. ఆ గొప్పవారి కళ్లనూ కొద్దివారి కళ్లనూ గొప్పగొప్ప మేడలూ భవంతులే ఆక్రమించుకొన్నవి. ఇక వాటిలో యీ పూరి గుడిసెలకు తా వెక్కడా? ఎంతసేపు చూచినా అన్నము ఉన్నవాళ్లను పిలిచేవాళ్లే గాని అన్నం లేనివాళ్లను పిలిచేవాళ్లెవరూ కన్పడలేదు. ఈ శుభకార్యాలు చేసేవాళ్లలో ఇదేమి నీతో, ఇదేమి ధర్మమో తెలియదు. గొప్పవాళ్లూ గొప్పవాళ్లనే పిలిచి మేపుతారు. కొద్దివాళ్లూ గొప్పవాళ్లనే పిలిచి మేపుతారు. కాని పెట్టడము యొక్క సార్థకత యెక్కడున్నదో ఆలోచించినవారు లేరు. ఆ భాగ్యవంతుల కేమి? దినానికి రెండుమార్లు కాఫీ ఫలహారాలూ, రెండుమార్లు వేపుడుకూరల భోజనాలూ. అటువంటివారిని వీరు పిలిచినా ఒకటే, పిలవకపోయినా ఒకటే. నిర్లక్ష్యం-పైగా పిలుపు అంతేనా అనీ, గౌరవించడం ఇంతేనా అనీ, పీటలు చిన్నవనీ, ఆకులు కుట్టు డాకులనీ, కూరలు రెండేననీ, పిండివంటలు స్వాగ్లేననీ పెరుగు కటికి పులుపనీ, ఏవేవో వంకలు ఆదినుంచి అంతముదాకా పెట్టుతునే ఉంటారు, తిన్నంత సేపు. అయితే నేమి? వాళ్లను పిలిచి పెట్టి వాళ్లచేత నాల్గు మాటలు పడితేనే గాని ధన్యులము కామనుకుంటారు గదా యీలోకులు. దీనులనూ, దరిద్రులనూ పోషించాలె, రక్షించాల అని యెన్నియుగాలనుంచో చదువుకుంటున్న దీమనుష్యలోకం. కాని యిది యెప్పటికీ చదువుగానే ఉన్నది. ఆచరణలోకి మాత్రం రాలేదు. ఆచరణలోనే వచ్చినట్లయితే, ఆగొప్పవారికి చేసే విందులు బీదవారికి చేసి వారిచేత దీవన లందకపోయినారా?

## 3


‘నిద్ర సుఖ మెఱుగదు; ఆకలి రుచి యెఱుగదు’ అంటారు గాని, నిజంగా ఆకలి అభిమానం యెఱుగదంటే బాగుంటుంది. గొప్పవారిని పదిమార్లు పిలిచిన పోవడానికి బెట్టుచేసే ఆ భోజనాలకు మావంటి దరిద్రులు “రావద్దూ రావద్దూ” అని నెట్టేస్తున్నా పోవడ మెందుకు? ఈ ఆకలిచేతనేగా. ఈ మాయఆకలే మనుష్యుల పీకు

తినకపోతే, ఈలోకంలో ఇంత నైచ్యమూ, ఇంత దైన్యమూ ఉండకపోవడమే కాకుండా ఒకరితో ఒక రికి పనీ, ఒకరి నొకరు అనుసరించుకొని ఉండడమూ ఒకరి కొకరు లొంగి ఉండడమూ, ఈ కలవులూ, కల హాలూ, సమ్మెకట్లూ, ఏమీ ఉండవు. అసలు బీదలు భాగ్యవంతులూ అనే విచక్షణే ఉండదేమో అనుకుంటా లోకంలో.

ఆ రాత్రి యింట్లో గింజలు లేనందున కాళ్లు కడుపులో పెట్టుకొని పడుకున్నాము, నేనూ నా పెనిమిటీ. అన్నం తినని తల్లివద్ద పా లెక్కడనుంచి ఊరుతాయి? పాలు లేక పిల్లవాడు తెల్లవార్లు యేడుస్తునేఉన్నాడు. ఏడ్చినప్పుడల్లా కాసిని కుండలో మంచినీళ్లు దాహంపట్టి తెల్లవార్చా. ప్రొద్దున లేవ గానే పిడికెడు నూకలుంటే గంజి కాచి ఉప్పురవ్వ వేసి పిల్లవాడికి పట్టి పడుకొండు గంట లైతేగా ఎక్కడికైనా భోజనానికి వెళ్లటానికని పొద్దుమాస్తూ కూచున్నాము. ఎట్లాగో భోజనాలవేళైంది. పిల్లవాడి నొక చేత నెత్తుకొని, ఆయనచేతికఱ్ఱ నొకచేత బట్టుకొని దోవ చూపుతూ బయలుదేరాను పెండ్లిండ్లూ, వడుగులూ జరుగుతున్న యిండ్లవెంట. మొదట తాసిల్దారుగారియింటికి వెళ్లాము, వారిఅమ్మాయి పెండ్లి అని, చాలా గొప్పవారితో సంబంధం చేసి మహావైభ వంగా పెండ్లి చేస్తున్నారనీ వినిఉండడం చేత.

మే మింకా అల్లంతదూరంలోనే ఉన్నాము. యమభటులవంటి జవానులు "ఏమమ్మోయి, ఎక్కడి కీ గుడ్డివాడిని గూడా తీసుకొని బయలుదేరి వస్తున్నావు? వెనక్కుపద, ఇక్కడ వీలు గాదు," అని కేకలుపెట్టారు. "మీరే కొప్పడకండి నాయనా. అమ్మగారితో మనవిచేసుకుంటా ము. వారేపొమ్మంటేపోతా"మన్నానునేను.

"అమ్మగారి ఉత్తరువే యిది" అన్నారు ఆ జ వాన్లు. పోయి చూస్తాము కాస్త పోనీండి బాబూ" అని మళ్లీ వేడుకున్నాను. "వల్లగాదు, పో"అన్నారు వాళ్లు. వల్లగాదని వాళ్లూ, కాస్త పోనీండని నేనూ—ఇట్లా అను కుంటూ ఉండగా, వారిలో ఒకడు "వల్లగాదంటే వాదన చేస్తావేమి, తాకితే మళ్లీ యేడుస్తావు. పో పో; మా చేత తోపిళ్లు తినకుండా మర్యాదగా పో. కోపంవచ్చెనా అంటే మీ బాపనోళ్లమడి చూచేవాళ్లం గా"దన్నాడు. "ఇస్, ఊరుకోరా; బీదవాళ్లు పాపం" అని యింకోడు తిన్నగా మందలించాడు. ఇంతలో పైమేడమీదనుంచి జవాన్లను పిలుస్తున్నట్టుగా కేక వినబడ్డది. "అయ్యా



"అయ్యా అయ్యా, అన్నారు...వాదన చాలించి"

ఆయ్యా" అన్నారు బంట్రౌతులు, మాతో వాదన చా లించి. "ఏమోయి,వీరాస్వామీ, రాఘవులూ, కోటయ్యా.

మీ కిదే చెప్పడం. ఈ దరిద్రపు మూకను మాత్రం వాకిట్లో అడుగు పెట్టనీయకండి. ఇదుగో, కరణాలు, మునసబులు పంపిన కావళ్ల వాళ్లో కళ్లు పీకించుకు తింటారు. ఈ దరిద్రపు సంచుకంతా యెవరు పెట్టుతారు? ఎక్కడివాళ్లను అక్కడ తరిమేయం" డన్న మాటలు వినబడ్డవి. చెప్పే దెందుకు, ఆయనే తాసిల్దారుగారు. గృహయజమాని ఉత్తరువు అట్లా ఉన్నప్పుడు జవానులు మాత్రం ఏమి చేస్తారు? ఇక లోపలికి పోవడం అనవసరమని వెనకకు తిరిగాము.

త్రోవలో "పిలవని యిండ్లకు పోతే యింతే ఉదాసీనం" అన్నాను నేను నాభర్తతో. "నరులు మనలను పిలుస్తారా? నరులు పిలిస్తే వెళ్లేవాళ్లు ఊళ్లో శ్రీమంతులు. మనం భగవంతుడు పంపిన అభ్యాగతులము" అన్నాడు నాభర్త.

## ౪

ఇంజనీరుగారి బంగ్లాళా ఊరివెలుపల ఎంతో దూరాన ఉన్నది. ఆరోజున వారిఅబ్బాయి ఉపనయనమని వినిఉండటంచేత అక్కడకన్నా పోదాం పదమన్నాడు నాభర్త. "అక్కడా జవాన్లు ఉంటారుగా. ఎక్కడికైనా జవాన్లు లేనియింటికి పోతే బాగుంటుం" దన్నాను. నేను "జవాన్లు ఉంటేమాత్రం ఏమి చేస్తారు? యజమానినిబట్టే వాళ్లూనూ. ఇంజనీరుగారు మహా మంచివారట. అక్కడ జవాన్లు బహుశా ఏమీ అనరులే" అన్నాడు నా పెనిమిటి. ఎండ అధికంగా ఉండడమే కాకుండా, వేడిగాడ్పు కూడా సాగింది. కాళ్లు కాలుతున్నవి. నెత్తి మాడుతున్నది. పిల్లవాడు ఎండకు వసివాడిపోతున్నాడు. ఎండ తగలకుండా పమిటకొంగు కప్పి నెమ్మదిగా ఆయనను కజ్జ పట్టుకొని నడిపిస్తూ నడుస్తూ ఉంటే పమిటకొంగులో ఉన్న రాము గుడ్డ తొలిగించి తొంగిచూస్తూ మరల గుడ్డలో దూరి కిలకిలా నవ్వుతూ నాతో దూబోచి లాడటం మొదలు పెట్టాడు. దారిద్ర్య దుఃఖదావాగ్నిలో మాడిపోతున్న నాహృదయానికి శీతల తుషార బిందువు సోకినట్లైన దాదోబూచి.

బంగాళాకు చేరేటప్పటికి అరగంటకు పైగా పట్టింది. ఇంజనీరుగారు వాకిట్లోనే పచారుచేస్తున్నారు. ఆ చల్లని ప్రభువును చూస్తే కడుపు నిండినట్లుగానే ఉన్నది. జవానులు ఏమీ అనలేదు. చూస్తూ ఊరకున్నారు. మహద్భాగ్య మనుకొని, రోడ్డు దిగి, సైడ్డు కాలవ దాటించి తిన్నగా నాభర్తను దొడ్డివాకిట వంట పందిట్లోకి చేర్చాను. వడ్డనయత్నంలోనే ఉన్నా రందరూ. ఏదో మూల నాభర్తను కూర్చోపెట్టుదా మనుకుంటూ అటూ యిటూ చూస్తున్నా. ఇంతలో ఒకామె ఇంట్లోంచి వచ్చింది. ఆమెకు ఒంటిమీద ఎక్కడ చూచిన రవ్వా కెంపు మెఱుస్తున్నది. మెడ తిరగకుండా ఉన్నవి బంగారపు గొలుసులూ, నానుత్రాళ్లూ, కాసుల పేరూ. చుట్టుజరీ పట్టుచీర కట్టుకొని ఉన్నది. నన్ను చూడగానే "ఎవరమ్మా నీవు? సరాసరి వంట పందిట్లోకే జొరబడ్డావు! ఈ గ్రుడ్డివా డెవడు? మీ తాలూకు మనిషేనా? ఆయనను తీసుకొ పదా అవతల" కన్నది. "అమ్మా! ఏదో పేదవాళ్లము" అన్నాను. "ఈపేదతనాని కేమిలే; కాస్త శుభకార్యం తలుచుకుంటే సరి, ఎక్కడ నుంచో పుట్ట పగిలినట్టు తయారవుతారు" అన్న దామె.

"ఏమో అమ్మా, తాము లక్ష్మీకటాక్షం పొందినవాళ్లు గనుక తమవాకిట పచ్చనితోరణం కట్టితే మావంటి దీనులకు సంబరం" అన్నాను.

"ఆఁ, ఈ ముఖస్తుతుల కేమిలే, పదా" అన్న దామె. "అకాల మైపోయింది; అవిటివాడు; కరుణించండి" అన్నాను నేను.

"ఓహో, మాటలు చాలా నేర్చావే! ఆయన అవిటివాడైతే నీ వేమి జేస్తున్నావు, దుంగలాగు? ఏమోయి, పాపయ్యా! మీ కేమీ బుద్ధి లేదూ: ఈ సంచునంతా యిట్లా వదిలేసి ఊరుకున్నావు?" అన్న దామె. వెంటనే జవాను ప్రత్యక్షమై వంట పందిరి గావడంచేత కాబోలు, దూరంగా నిలబడి "రాండమ్మా యివతలికి" అన్నాడు. ఇంతలో ఇంజనీరుగారు లోపలికి వచ్చి, "ఏదో బీదవాళ్లు, అన్నమంటూ వచ్చారు, కాస్త పెట్టి

పంపించూ." అన్నారు. "ఆఁ; మీ కేమీ, అట్లాగే అంటారు. సాయంత్రం ఉద్యోగస్థుల బంతి పెందలాడే భోజనాలైతే గాని సాయంత్రపు పని చేసుకోడానికి ఉండదు. వచ్చిన వాళ్లందరికి పెట్టుకుంటూ కూచుంటే పని తెవులవద్దూ? పోనీండి; ఎక్కడో అక్కడ తింటారు. పోవమ్మా, పో" అన్నది. పాపము ఆయన మళ్లీ మాట్లాడలేదు. ఆయనకు ఊళ్లో పలుకుబడే గాని



"ఈ ముఖస్తుతుల కేమిలే పదా అన్న దామె."

యింట్లో పలుకుబడి లేనట్టనిపించింది. రాతు మెత్తనైతే గుఱ్ఱం మూడుకాళ్ల నడుస్తుందిట. ఆమె మణిమయాభరణాలు బయటికే గాని లోపలికి వెలుగును ప్రసారించేవి కావు. లోపలగూడా వెలుగు నిచ్చే మణి ఏదైనా ఆమె హృదయంలో ఉన్నట్లైతే పరిపక్వాన్నాలు దగ్గిర బెట్టుకొని అన్నము, అన్నము, అని అల్లాడే ఆతురులకు లే దంటుందా? భాగ్యవంతుల రాత్రి బంతి భోజనాలకోసం బీదవాళ్లకు ప్రొద్దుటినుంచే అన్నము శూన్యం చేస్తుందా? ఏమైతే నేమి. మొగుడు మాటైనా పాటించకుండా నిర్దాక్షిణ్యంగా ఆమె మమ్మని త్రోసేయించింది. మేము ఏవొక్కక్షణం ఆలసించినా అన్నం పెట్టవలసి వస్తుందని భయం కాబోలు. క్షణం నిలువనీయలేదు.

కళ్ల వెంబడి నీళ్లు కారుస్తూ మళ్లీ రోడ్డుమీద నిలబడ్డాము. ఎండ దెబ్బ కాగలేక పిల్లవాడు చేతిలో నిలవకుండా యేడవటం మొదలు పెట్టాడు. ఏమి చేయాలో తోచదు. ఎక్కడికి పోవాలో తోచదు. జగత్తంతా నిరాలంబంగా, నిరాశ్రయంగా, సర్వ శూన్యంగా కనపడ్డది.

"ఏమే, ఎందుకే నిలబడడం? కాళ్లు కాలుతున్నాయి, పోదాము పదా" అన్నాడు నాభర్త.

"ఎక్కడికి?" అన్నాను.

"ఓసి పిచ్చిదానా! ఎక్కడ కంటా వేమిటి? మనఅన్నం ఎక్కడున్నదో అక్కడికీ."

"మీవేదాంతం నా కర్థం కావడం లేదు. మనకుఅన్నం ఎక్కడా లేదు. ఉంటే ఇటువంటి సంపన్నగృహాలలో మనకు పట్టెడన్నము దొరకక పొయ్యేదా?" అన్నాను.

"నీకు తెలియదు, పదా ఇంకోయింటి" కన్నాడు నా పెనిమిటి.

"అక్కడా యింతే అయితే "అన్నాను.

"అయితే యింటికే పోదాము" అన్నాడు.

"ఇంట్లో యేమున్నదీ? ఇంట్లో యేమన్నా ఉంటే ఇట్లా బయలుదేరుతామా?" అన్నాను

ఇద్దఱమూ కళ్ల నీళ్లు పెట్టుకున్నాము. "ఓ భగవంతుడా! ఆ అదృష్ట వంతులకు ఇంతటి ఐశ్వర్యమిచ్చావు, బాగానే ఉన్నది. ఈ దరిద్రులవిషయంలో వీరి కష్టాలు ఇతరులు గ్రహించే అనుగ్రహమన్నా చూపగూడదా? ఒకరిపైన నీదయారసం పొంగి పొరలించి ఒకచోట పొడి తడియకుండా విరవిర లాడిస్తావే. ఏమి స్వామీ! ఈ దీనులు చేసుకున్న పాపం" అని కాసేపు

క్షుధాక్షుభిత హృదయాలతో ఆదేవునిగూర్చి మొఱపెట్టాము. ఎంత మొత్తుకుంటే ఏమున్నది? ఊఁ అంటాడా, ఆఁ అంటాడా ఆదేవుడు!

ప

అదొక ప్లీడరుగారియిల్లు. వారియింట్లోనూ పెళ్లే. వాకిటినిండా పరజాలు కట్టి ఉన్నాయి. వడ్డన జరుగుతున్నది. అందఱూ విస్తళ్ల ముందర కూర్చుని ఉన్నారు. మేము గూడా ఎక్కడో ఒకచోట కూర్చుని భోజనం చేద్దాం మనే ఉద్దేశంతో పరజా ఒత్తిగించి లోపల నలువైపులా పరికించి చూచాను. అంతా నిండి ఉన్నారు. మఱోవైపు వెళ్లి చూచాను. అదృష్టవశాత్తు నాల్గు వడ్డించి ఉన్న విస్తళ్లు కనపడ్డాయి. ఎవరైనా అక్కడ కూర్చున్నట్టు చెంబులైనా పెట్టి ఉండలేదు. ఇక ఇక్కడ అన్నం దొరికినట్టే నని సంతోషించి మా ఆయనను తీసుకొచ్చి ఒకవిస్తరిముందర కూర్చోబెట్టి నేనూ ఒక విస్తట్లో కూర్చోబోతున్నా. మాపిల్లవా డప్పుడే ఆ విస్తట్లో అన్నం చూచి కొకెసలు కొట్టుకుంటూ దానిమీదకు దూకబోతున్నాడు. ఇంతలో యెక్కడినుంచివచ్చిందో ఒక వితంతువు, సన్నగా మెటికెలా గున్నది. హృదయంలోని కాఠిన్యం పొడుచుకువచ్చినట్టు కనపడుతున్నది ఆమె ముఖాన. ఆమె గొంతు చించుకోడం చూస్తే ఆయింట్లో ఆమెదే సర్వంసహాధిపత్యంగా కనపడుతున్నది. ఆమె మళ్లీ జబాబుకైనా అవకాశం ఇవ్వకుండా, "ఎవరమ్మో నీవు, ఈయనొకాయనను దగ్గిర పెట్టుకొని కూర్చున్నావు. లే, లే, లే. అవతల పెద్దమనుష్యుల భార్యలు కూర్చునేతావు లేక నిలబడిఉన్నారు. లే, లే, తొందరగా" అని తొందరించింది. ఇక అక్కడ నిలవడానికి ఆదరువు లేక మా ఆయనన్ను లెమ్మని, నేనూ లేచి, ఆయనను చేయి పట్టుకొని ఇవతలకు తీసికొచ్చి, మఱెక్కడైనా వీలుంటే కూర్చుందామని నలువైపుల చూస్తున్నా. "ఏమిటమ్మో, చూస్తున్నావు. మళ్లీ యెక్కడైనా కూర్చుందామనా? అసలిక్కడ వీలు గాదు, పదా బయటికి. గడప పచ్చనచేసుకోడం భయం, సిద్ధమౌతారు మాయగుంపు. ఎవరు పిలిస్తే వచ్చినట్టో, సిగ్గు, బిడియం లేకుండా. పదా బయటికి" అన్నదామె, మళ్లీ వెంట తరిమి వచ్చి.

ఇంతమంది శ్రీమంతులు ఇన్ని శుభకార్యాలు జరుపుతుంటే ఒకచోట కాకపోతే ఒక చోటైనా మాకింత అన్నం దొరకక పోతుందా అన్నఆశ అంతకుపూర్వం రెండు యిళ్లలో జరిగిన అనుభవంవల్లా నశించలేదు గాని యీ వితంతువు చేసిన పరాభవంతో పూర్తిగా పోయింది. ఆమె మాటాడిన వీమాటలే అయినా పలుగుపోట్లవల్లనైనా కలుగనంత బాధ కలిగింది. అసలే దారిద్ర్యంచేతా, ఆకలిచేతా, ఎండచేతా, దుఃఖంచేతా చివికి శిథిలమైపోయి ఉన్న మాజవసత్వాలు ఆమెగారి మాటలతో మఱీ నశించిపోయినాయి. ఆమెగారి మాటల కేదో సమాధానం చెప్పవలెనని మనసు పీకులా



"ఆమె మళ్లీ జబాబుకైనా......అని తొందరించింది"

డింది. కాని నోట్లోనుంచి మాట రాలేదు. ఆపందిరిలోనుంచి తత్క్షణమే బయటికి రావలెనని ఎంత ప్రయత్నించినా కాళ్లు తడబడడంచేత ఎంతసేపో పట్టింది. చంకలో నున్న నాబిడ్డ ఆవిస్తళ్లలోని అన్నంవంక చేయి చాపి ముందుకు ఒరగబడి యేడుస్తునే ఉన్నాడు. ఏ ఉదాసీనపడైనా ఆ అన్నం తిని ఈ కడుపుమంట చల్లార్చుకుంటే బాగుంటునని మాప్రాణమూ పీకుతునే ఉన్నది. కాని ఆ ఐశ్వర్యమదోన్మత్తులను, ఆలోకానుభవశూన్యులను,ఆదాక్షిణ్యరహిత చిత్తులను 'ఆకలిగొన్న మాకు అన్నం పెట్టకుండా ఈగొప్పవాళ్లకు పెట్టడమే'మని నిలువదీసి అడగడానికి మాకేమి అధికారమున్నది? ఏడుస్తున్న బిడ్డను అక్కున అదుముకొని, నిర్విణ్ణుడై నిలబడిన భర్తను చేతబట్టుకొని, కనుల నిండిన కన్నీళ్లు త్రోవను కనబడకుండా చేస్తుండగా, అప్పలతో అప్పళించుకుంటూ బయటికి వచ్చాను. తిని పారవేసిన విస్తళ్లలోని మెతుకులను కాకులు గుంపులు గూడి తింటున్నవి. ఆ యెంగిలాకులు నాకడానికే కాబోలు కవ్వుకవ్వుమని కాట్లాడుకుంటూ అయిదాఱు కుక్కలు గూడా అక్కడే ఉన్నవి. ఆ ప్రహరీగోడకు ప్రక్కగానున్న చెట్టునీడను ఇకను తిని పారవేసే ఆకుల కోసం యెదురుచూస్తూ యేనాదివాళ్లయిదారుగురు పిల్ల జెల్లాతో పేలు చూచుకుంటూ కూర్చున్నారు. మేము బయటికి రాగనే ఒక యేనాదివాళ్ల కుఱ్ఱాడు, పదహారేళ్లవాడు మాకెదురుగా వచ్చి "అమ్మగారూ భోజనాలైనాయా?" అన్నాడు.

నేనూ కళ్ల నీళ్లు తుడుచుకుంటూ "లేదు! ఇప్పుడే చేయబోతున్నారు" అన్నాను.

"అయితే మీరు వెళ్లిపోతున్నారేమమ్మ" అన్నాడు.

"మాకు అన్నంపెట్టం అన్నా"రన్నాను.

"అయితే యేమి జేస్తా"రన్నాడాపిల్లవాడు, ఆత్రంతో. "చేసే దేమున్నది? ఇంటికి వెళ్లుతాము" అన్నాను.

"వెళ్లి యింట్లో అన్నం వండుకుంటారా?" అన్నాడు.

"వండుకోటానికి గింజలుంటే ఇట్లా యెందుకొస్తాము నాయనా?" అన్నాను నేను.

"అయితే ఇంట్లో బియ్యముః లేవూ? ఈ యెండలో తిరిగి తిరిగి వెళ్లి ఇంట్లో తిండిలేకుండా పడివుంటారా?"

పాపం ఆ అనాగరీక బాలుడికళ్లు నీళ్లతో నిండిపోయినాయి. నావంక మహా జాలిగా చూస్తూ మాతోనే నడుస్తూ "పాపం, ఆయనేమో గుడ్డివాడు, నీవేమో ఆడదానవు, ఈ పిల్లవాడియీలంగా పనికీ పాటకూ పోలేవు. అన్నం ఎట్లా వస్తుంది పాపం? ఈ బాపనోరు కలిగినోరికి పెట్టకపోతే మీవంటి అన్నం లేనివారికి పెట్టరాదూ" అని ఉపచారవాక్యాలు పల్కుతూ మా యింటిదాకా వచ్చి, "ఇదేనా మీయి"ల్లని వెళ్లిపోయినాడు.

## ౬

ఇంటికొచ్చి తలుపుతీసి చూచుకునేప్పటికి పుట్టెడు దుఃఖం వచ్చింది. సర్వవస్తు సంపూర్ణంగా ఉన్నట్లయితే అదే భూతలస్వర్గం అనుకోవచ్చును గాని శూన్యగృహం చూస్తే ఏమి ఆనందంగా ఉంటుంది? పిల్లవాడు యేడ్చియేడ్చి సొమ్మసిల్లి త్రోవలో బుజంమీదనే నిద్రపోవడంచేత వాడి నొక నులకమంచమీద పడుకోబెట్టి, తాపం తీరేటట్టుగా కాళ్లూ చేతులూ కడుక్కుంటారుగదా అని మా ఆయనకు చేదెడు నీళ్లు తెచ్చియిచ్చి, నేనూ కాళ్లూ మొఖమూ కడుక్కొని, ఆయనను లోపలకు తీసుకొనివచ్చి కూర్చోబెట్టి, నట్టింట కొంగు పర్చుకొని పడుకున్నాను నేను. మా దరిద్రావస్థ, ఆ భాగ్యవంతులు ధనమదాంధతలో పడి నిజంగా అన్నమని అడిగేవాళ్లకు పెట్టకుండా భాగ్యవంతులకు విందులు చేసుకుంటూ ఆ శుభకార్యాలు చేసుకోడం, అన్నీ తలపుకు రావడం మొదలుపెట్టినాయి. అవి తలుచుకొన్నకొద్దీ మనస్సులో ఒకప్పుడు ఆశ్చర్యమూ, ఒకప్పుడు విచారమూ, ఒకప్పుడు ఆగ్రహమూ, ఒకప్పుడు

ద్వేషమూ సందడిచేయడం మొదలుపెట్టినవి. ఇంతకూ ఒకరిని పోయి అడగడంవల్లనే గదా యివన్నీ వచ్చినవి. ఆహారవిషయంలో నరులంత నిస్సహాయమైన జంతువు లేవీ లేవు. ఇన్ని జీవరాసులను చూస్తున్నాము గదా. ఏవైనా ఆపూట కాహారము లేదని వస్తువడుకోటం గాని, రేపటికని నిల్వచేసుకోడం గాని చూస్తున్నామా? మానవులకే వచ్చింది యీ దురవస్థ, ఈ నిస్సహాయత. మానవులు వివేకసంపన్నులని కాబోలు వాళ్ల విచక్షణకు వదిలిపెట్టాడు ఆహారం విషయం దేవుడు. మానవుల విచక్షణ యిట్లు దుర్వినియోగం అవుతున్నది. అందుకు భగవంతు డేమి చేస్తాడు? వీళ్ల బుద్ధిలోపం గాని. అబ్బా, ఎంత భారమైంది యీమానవజన్మ! ఉండటానికి కొంప, తినడానికి తిండి, పక్వంచేసుకోడానికి పాత్రలు, కట్టుకోడానికి బట్టలూ, పడుకోడానికి పక్కలూ, ఒక టేమిటి, ఎన్నో కూర్చుకుంటేనే గాని యీమానవ జన్మ వెళ్లిపోదు. కుక్క తనబిడ్డయొక్క పోషణభారం నెలరోజులలో వదిలించుకొంటుంది. కాకి రెక్కలొచ్చిన వారంరోజులలో 'నీ ఆహారం నీవు తెచ్చుకో'మని పంపేస్తుంది, తనపిల్లను. ఈ మానవుడికో, ఎన్నేళ్లకూ రాదు, పోషించుకునే సామర్థ్యం. అందులో బీదవాళ్ల పిల్లవాడైతే పదేళ్లకైనా అక్కరకు వస్తాడు. భాగ్యవంతుల బిడ్డయితే పాతికేళ్లకే. ఆ యేనాది పిల్లవాడు పాపం ఎంత ఆదరణగా వెంటాడి వచ్చి మాట్లాడినాడో! వాడిమాటలు చూస్తే కడుపు నిండినట్లయింది. ఇందుకే గదూ అన్నరసంకంటె ఆదరణరసం గొప్ప దంటారు.

అని యీవిధంగా పిచ్చిపిచ్చిగా ఆలోచించుకుంటూ నడుమనడుమ పరాభవాగ్నికి కుమిలిపోతూ, క్షుద్బాధకు కన్నీళ్లు విడుస్తూ ఏదోలోకంలో ఉన్నా. అవతల పైపంచతో మొఖం తుడుచుకుంటూ, "నారాయణ, నారాయణ," అంటున్నాడు నాభర్త. ఆమాట చెవుల బడగానే నాకు చుఱ్ఱుమన్నట్లయింది. "ఇకను ఆనారాయణ పేరెత్తవద్దు. రాత్రింబవళ్లు యింతగా తన్ను స్మరించబట్టే నానాటికి కూటికీ గుడ్డకూ దూరం చేస్తున్నాడు. పెట్టే పోయని యీ పక్షపాతపు దేవుణ్ణి స్మరించి ఏమిలాభం" అన్నాను.

నా పెనిమిటి ఒక్కనవ్వు నవ్వాడు, నామాటవిని.

"నవ్వేట్లా వస్తున్న" దన్నాను నేను కోపంతో.

"నీ పిచ్చిమాటలకు నవ్వక యేమిచేయను! కష్టకాలంలో ఆ నారాయణమూర్తిని కాకపోతే మరెవ్వరిని తలుచుకుంటే శాంతి గల్గుతుంది? పాల ముంచినా వాడే, నీట ముంచినా వాడే" అన్నాడు నా పెనిమిటి.

"చాల్లెండి, మీ మాటలు! తినా, కుడవా ఉన్న వాళ్లు కృతజ్ఞతగా ఆయనను తలుచుకున్నా బాగుంటుంది. మన మేమని ఆయనను స్మరించడం? నిర్దయుడై మనల నింత కటికిదరిద్రులనుగా చేసిందే గాక ఊళ్లో యిన్ని శుభశోభనాలు జరుగుతుంటే ఏయింటా పిడికెడన్నము దొరకకుండా చేసిన ఆభగవంతుణ్ణి యింకా స్మరించుకోవాలనా? కంటికి కన్పడి చేతికి చిక్కితే..." అని పండ్లు పటపటా కొరికాను కోపంతో.

"సరే అది మనకర్మం" అన్నాడు నాభర్త మెతల.

"ఏమిటే! మనకు సర్వసౌఖ్యాలు ఉంటే అది భగవంతుడి అనుగ్రహమా! మనకు ఏమీ లేకపోతే మన కర్మమా? కర్మమైతే రెంటికి కర్మమే అనుకోరాదూ."

"మీరేమన్నా చెప్పండి, అసలు భగవంతుడు లేనేలేడు. ఉన్నట్లయితే ఇటువంటి ఆపన్నులను చూచి సహింపనే సహింపడు. లేడు, ముమ్మాటికి లేడు" అన్నాను నేను.

"ఛీ అట్లా అనబోకు. దరిద్రనారాయణుడని ఆజగద్రక్షకుడికి బిరుదైతే" అన్నాడు నా పెనిమిటి దృఢంగా.

"బిరుదుల కేమి? మీవంటి అమాయకపు భక్తులు ఎన్ని బిరుదులైనా యిస్తారు, వెఱ్ఱివెఱ్ఱిగా. గాని దేవుడూ లేడు, గీవుడూ లేడు. ఒకవేళ ఉంటే దయారసం గలవాడు కానేకాడు" అన్నాను, నా కడుపుమంట కొద్దీ.

ఇంతలో ఎవరో వస్తూవున్నట్టుగా వాకిలివైపు కాళ్లచప్పుడు వినబడ్డది. ఎవరో అని ఆలకిస్తూ ఉండగా,

'అమ్మగారూ' అన్నపిలుపు వినిపించింది.

'ఎవ' రని చివాలున లేచి తలుపు తీశా.

ఏనాది కుఱ్ఱవాడు.

"ఏమిరా?" అన్నాను.

"ఇదిగో, బియ్యం తెచ్చా, చేట పట్టండి" అన్నాడు.

"ఎక్కడివి?" అన్నాను.

"బజారునుంచి కొనుక్కొచ్చా" నన్నాడు.

"డబ్బో?" అన్నాను.

"నాదగ్గిర ఉంటే తెచ్చా" నన్నాడు.

"పాపం, నీకుమాత్రం యెక్కడి" దన్నాను.

"పొద్దున సౌరవారి గుఱ్ఱానికి గడ్డి చెక్కుకొస్తే పావలా యిచ్చారండీ" అన్నాడు.

"ఆపావలా మాకు కర్చుచేస్తే మీకో పాపం" అన్నాను.

"మాకు యివ్వాళ ఎంగిలాకుల్లో అన్నం దొరుకు తుందిగా" అన్నాడు.


"ఇవ్వాళ వెళ్లితే సరా, రేపో" అన్నాను.

"రేపు మళ్లీ గడ్డి చెక్కుకొచ్చి పావలా సంపాదించనా" అన్నాడు. ఏమిధైర్యం. వందలు వేలు సంపాదించిన ఆ శ్రీమంతులకైనా లేకపోయిందే ఈ ధైర్యం అనిపించి, "అయినా అబ్బాయీ, మీరైనా బీదవాళ్లే; మీ కష్టార్జితం మా కెందుకు నాయనా?" అన్నాను.

"బీదవాళ్లకే బీదవాళ్లకష్టాలు తెలిసేది; మీ కెందుకు పట్టం" డన్నాడు.

ఇదేదో భగవత్ప్రేరితం అనుకున్నాను. ఒళ్లు జలదరించింది. మాట్లాడకుండా చేటతెచ్చి ముందుపెట్టాను. చెఱుగులోబియ్యం చేటలో పోశాడు. ఒకడుగు ముందు వేసి మళ్లీ వెనక్కు తిరిగి, "అమ్మా అన్నంలోకి యేమైనా ఉన్నదా?" అన్నాడు. "కుండలో గోగుపచ్చడి ఉన్నదిలే" అన్నాను. క్షణం నిలవలేదు. రివ్వున వెళ్లిపోయినాడు. నాకేమో భయమైంది. గుండెలు జల్లుజల్లు మన్నవి. శరీరం గగుర్పొడిచింది. ఆ అనాగరిక బాలుడి ముఖంలో ఏదో దయారసంతో గూడిన అపూర్వతేజం కనిపించింది. అదే గాబోలు, భగవత్తేజం అనిపించింది. ఇంకా కాసేపు ఆ ముఖారవిందం సేవించకపోతినే అనుకున్నాను. కాని ఆ బాలమూర్తి ఒక్కక్షణం సేపైనా నిలిస్తేగా చూచేది? మాసంభాషణలంతా జాగ్రతగా వింటూఉన్న నాభర్త "నే చెప్పలేదుటే, భగవంతుడు దరిద్రనారాయణుడని" అన్నాడు.

"ఔనౌను" అని చెంపలు వేసికొని చేతులు జోడించాను.



"ఒళ్లు జలదరించింది.......చేటతెచ్చి ముందుపెట్టాను"